సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



వన్యప్రాణుల రక్షణపై దృష్టి

వేసవి నేపథ్యంలో అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,010
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,539
3 శాతం జీఎస్టీతో	రూ.5,705
సవర (8 గ్రా)	రూ.45,640

గరిష్టం/కనిష్టం
38.1 /28.4

వాతావరణం

ఆదివారం గాలిలో 70 శాతం తేమ ఉంది. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. సోమవారం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

గ్రూప్ బీ, సీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): భారత ప్రభుత్వంలోని వివిధ సంస్థలు, శాఖలు/ట్రిబ్యునల్స్‌లో గ్రూప్ -బీ, గ్రూప్ - సీ, ఇతర ఖాళీగా ఉన్న పోస్టులకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ - 2023 కోసం ప్రభుత్వం ఈనెల 3న నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించేందుకు ఆఖరి గడువు వచ్చే నెల 4వ తేదీ అన్నారు. ఈ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన పోస్టుల వివరాలు, వయో పరిమితి, విద్యార్హతలు, పరీక్ష, దరఖాస్తు చేసే విధానం తదితర సమాచారం కోసం ఎస్ఎస్‌సీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. సౌత్ రీజియన్ పరిధిలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లో పది, పుదుచ్చేరిలో ఒకటి, తమిళనాడులో ఏడు, తెలంగాణలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటైనర్ చక్రాల కింద నలిగిన ప్రాణం

- నెల్లూరులో వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): కంటైనర్ ఢీకొని వృద్ధుడి మృతి చెందిన ఘటన నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డు జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలోని ఓ కార్ల షాపు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. బీవీనగర్‌కు చెందిన పి.సుబ్బయ్య (77) కొంతకాలంగా జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలోని పవన్ కార్స్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 22వ తేదీ రాత్రి ఆయన విధులకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున షాపు వద్ద చెత్తాచెదారాలను చిమ్ముతుండుగా బీవీనగర్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్ ఆయన్ను వేగంగా ఢీకొని తొక్కుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో సుబ్బయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్సై జె.కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని చెన్నైకి చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సుబ్బయ్య కుమారుడు పోలయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేశారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఓ ప్రముఖ కొరియర్ సంస్థకు చెందిన వస్తువులను కంటైనర్ చెన్నై నుంచి నెల్లూరులోని ఆ సంస్థ కార్యాలయాలకు చేరవేసి తిరిగి చెన్నై వెళ్తూ వృద్ధుడిని ఢీకొందని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): భార్యాపిల్లలు తనతో లేరని సహజీవనం చేస్తున్న మహిళ సైతం దూరమైందని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన రాజశేఖర్ (39)కు వరలక్ష్మి అనే మహిళతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా రాజశేఖర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో వరలక్ష్మి తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. నెల్లూరు జ్యోతినగర్‌లో రాజశేఖర్ సమీప బంధువైన ఓ మహిళ ఉంటోంది. ఆమె భర్త నుంచి విడిపోయింది. రాజశేఖర్ ఆమెతో సహజీవనం చేశాడు. ఇటీవల వారి మధ్య విభేదాలు చోటుచేసుకుని దూరంగా ఉంటున్నారు. భార్యాపిల్లలు తనతో లేకపోవడం, సహజీవనం చేస్తున్న మహిళ దూరం అవడంతో అతను తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో రాజశేఖర్ పురుగుమందు తాగాడో? లేక విషం తీసుకున్నాడో తెలియదు కానీ తాను సహజీవనం చేసిన మహిళ ఇంటికి వచ్చి ఏదో మందు తాగానని చెప్పాడు. దీంతో ఆమె అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించింది. రాజశేఖర్ తమ్ముడు గిరిప్రసాద్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలియజేసింది. ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే రాజశేఖర్ మృతి చెందాడు. నెల్లూరుకు చేరుకున్న గిరిప్రసాద్ తన అన్న మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ మేరకు ఆయన వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోమశిలలో 51.795 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 51.795 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 196 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

గంజాయిపై ఖాకీ గురి

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పోలీస్ బాస్ ఆధ్వర్యంలో మూలాల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. వినియోగదారులపై కూడా కేసులు నమోదు చేస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల గంజాయి సరఫరా మూలాలను వెతికి అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశారు.

మూలాల ఏరివేతకు ప్రత్యేక ప్రణాళిక

- సరఫరా, విక్రయదారులే కాదు వినియోగదారులకూ చుక్కలు
- రోజుల వ్యవధిలో 60 కేజీల స్వాధీనం
- అంతర్రాష్ట్ర సరఫరాదారుల అరెస్ట్
- పదేపదే అరెస్ట్ అయిన వారిపై పీడీ యాక్ట్ ప్రయోగం



గంజాయి సరఫరా, విక్రయదారులు, వినియోగదారుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. పెద్దఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను జైలుకు పంపుతున్నారు. పదేపదే నేరాల్లో పట్టుబడే వారిపై సస్పెక్టెడ్ షీట్లు అవసరమైతే పీడీ యాక్ట్‌లు నమోదు చేసేందుకు వెనుకాడడం లేదు. ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి దాడులు చేస్తున్నారు. పలు రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా నిందితులు తరలిస్తున్నారు. దీంతో జాతీయ రహదారి వెంబడి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు.

సంబంధాలు నెరుపుతూ..

గంజాయి సాగుదారులు, వ్యాపారులతో జిల్లాకు చెందిన కొందరు సంబంధాలు నెరుపుతున్నారు. కేజీ రూ.4,500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అనంతరం కేజీకి రూ.7,500 వరకు జిల్లాలోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వారు 100, 50 గ్రాముల ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇప్పుడు మారింది

ప్రధానంగా విద్యార్థులు, యువతే లక్ష్యంగా విక్రయాలు సాగుతున్నాయి. జిల్లాలోని పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన యువకులు పనులు చేస్తున్నారు. ఇక ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నగరంలోని విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారు. స్థానికంగా ఉన్న హాస్టల్స్, పీజీల్లో ఉంటున్నారు. ప్రధానంగా వీరిని లక్ష్యంగా చేసుకున్నారు. సెబ్ దాడులు ముమ్మరంగా జరుగుతుండడంతో పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది.

మూలాల ఏరివేత

దాడులు చేయడం.. కేసులు నమోదు చేశామని సరిపెట్టుకోకుండా మూలాల ఏరివేత దిశగా సెబ్ అధికారులు చర్యలు చేపట్టారు. దాడుల్లో పట్టుబడిన నిందితుల నుంచి ఎక్కడ?, ఎవరి వద్ద?, ఎవరి ద్వారా గంజాయి కొనుగోలు చేశారు తదితర పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. సరఫరాదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. సాంకేతికత ఆధారంగా వారిని గుర్తించి అరెస్ట్‌లు చేస్తున్నారు. జిల్లాలో కేసులు నమోదై ఇప్పటికే వివిధ రాష్ట్రాల జైళ్లలో ఉన్న సరఫరాదారులను పోలీస్ అనుమతితో కస్టడీలోకి తీసుకుని అరెస్ట్‌లు చేస్తున్నారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న పలువురిని బైండోవర్లు చేస్తున్నారు.

వినియోగదారులపై కేసులు

ఇప్పటి వరకు గంజాయి సరఫరాదారులు, విక్రయించే వారిపైనే అధికారులు కేసులు నమోదు చేశారు. అయితే గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు వినియోగదారులపై సైతం కేసుల నమోదు చేస్తున్నారు. ఇటీవల ఆరుగురు వినియోగదారులపై కేసులు నమోదయ్యాయి. దీంతో సేవిస్తూ పట్టుబడితే జైలు ఊచలు లెక్కించాల్సి వస్తోందనన్న భయంతో పలువురు గంజాయి తాగడం మానేస్తున్నారు.



ఇటీవల స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, మొబైల్ ఫోన్లు

జిల్లాలో..

గంజాయికి సంబంధించి నమోదైన కేసులు : 178
(సెబ్ ఏర్పాటైన నాటి నుంచి గతేడాది డిసెంబర్ నెలాఖరు వరకు)
ఎంతమందిని అరెస్ట్ చేశారంటే.. : 348
(నిందితుల్లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వారు సైతం ఉన్నారు.)
స్వాధీనం చేసుకున్న గంజాయి : 3,131 కేజీలు
(హాష్ ఆయిల్‌ను సైతం పట్టుకున్నారు)
వాహనాలు : 22
- గత వారంరోజుల వ్యవధిలో జిల్లాలో 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 15 మందిని అరెస్ట్ చేశారు.

అవగాహన సదస్సులు

మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మత్తుకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు. అదేక్రమంలో తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలని, పిల్లల ప్రవర్తనలో తేడా గమనిస్తే బెదిరించడం, దండించడం చేయకుండా స్నేహపూర్వకంగా మాట్లాడి కారణాలు తెలుసుకోవాలని, మత్తుకు అలవాటుపడ్డారని తెలిస్తే కౌన్సెలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

ఊచలు లెక్కించాల్సిందే..

గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. కేవలం సరఫరా, విక్రయదారులే కాకుండా గంజాయి సేవించే వినియోగదారులు కూడా ఊచలు లెక్కించాల్సిందే. తల్లిదండ్రులు కూడా పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలి. నెల్లూరు గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. సరఫరాలో ఇతర రాష్ట్రాల వాసులను కూడా వదిలిపెట్టడం లేదు. అన్ని కోణాల్లో విచారించి అరెస్ట్‌లు చేస్తున్నాం.

– కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ, నెల్లూరు

ఒక్కసారిగా వాతావరణం మారి..



నెల్లూరులో కురుస్తున్న వర్షం

- జిల్లాలో పలుచోట్ల వర్షాలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఏప్రిల్ నెల ప్రారంభం నుంచే అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 39 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతుండగా శనివారం 37.5 డిగ్రీలకు తగ్గింది. ఆదివారం ఉదయం పెరిగి 38.1 డిగ్రీలకు చేరుకున్నా మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడింది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమైంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. దీంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. సాయంత్రానికి నెల్లూరు, కావలి తదితర చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. నెల్లూరు నగరంలో గాలులు విపరీతంగా వీచాయి.



నగరంలో..

మల్లూరు పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు



కలిగిరి: నాగసముద్రంలో ఆహ్లాదకర వాతావరణం మధ్య ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

- జిల్లాస్థాయి అవార్డులకు 23 పంచాయతీల ఎంపిక
- నేడు అవార్డుల అందజేత

నెల్లూరు(పొగతోట): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి అవార్డుకు ముత్తుకూరు మండలం మల్లూరు గ్రామ పంచాయతీ ఎంపికైంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆర్థికపరంగా, పరిశుభ్రత, ఫ్రెండ్లీ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, తాగునీటి సరఫరా తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో గ్రామ పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేస్తారు. ఈ ఏడాది మల్లూరు గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయికి, జిల్లా స్థాయిలో మరో 23 పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. రాష్ట్ర స్థాయి అవార్డును విజయవాడలో సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకుంటారు. జిల్లాస్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో ఎంపీడీఓలు అందజేస్తారు. సోమవారం ఉదయం నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం జరుగుతుందని సీఈఓ బి.చిరంజీవి ఆదివారం తెలిపారు.

జిల్లాస్థాయిలో..

ముత్తుకూరు మండలంలోని మల్లూరు, ఉదయగిరిలోని వెంగళరావునగర్, బోగోలు జువ్వలదిన్నె, నెల్లూరు రూరల్‌లోని సౌత్‌మోపూరు, పొదలకూరులో పులికల్లు, దుత్తలూరులో పాపంపల్లి, వింజమూరులో చాకలికొండ, వోలేటివారిపాళెంలో నూకవరం, చేజర్లలో కాకివాయి, ఆత్మకూరులో వాశిలి, గుడ్లూరులో కొత్తపేటలో, కావలిలో తల్లపాళెం, కలిగిరిలో నాగసముద్రం, మర్రిపాడులో బుదవాడ, తోటపల్లిగూడూరులో వరిగొండ, విడవలూరులో గాదెలదిన్నె, ముత్తుకూరులో పాతురువారికండ్రిగ, జలదంకిలో జమ్ములపాళెం, కొడవలూరులో గౌతమ్‌నగర్, ముత్తుకూరులో దువ్వూరువారిపాళెం, రాపూరులో పంగిళి, లింగసముద్రంలో మాలకొండరాయునిపాళెం, కోవూరు మండలంలోని ఇనమడుగు పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి.

‘కంటి’కి రెప్పలా..

పేదలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ఆస్పత్రుల రూపురేఖలు మార్చేసి ఆధునిక వసతులు కల్పిస్తోంది. నెల్లూరులోని పెద్దాస్పత్రికి ఒకప్పుడు రోగులు వెళ్లేందుకు ఆసక్తి చూపేవారు కాదు. నేడు పరిస్థితి మారింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రూపాయి ఖర్చు లేకుండా రోగులు మెరుగైన వైద్యసేవలను పొందుతున్నారు.

- పెద్దాస్పత్రిలో అందుబాటులో పూర్తిస్థాయి కంటి విభాగం
- ఒకప్పుడు పరికరాలు అంతంతమాత్రమే
- రూ.కోట్లతో లేజర్, స్లిట్‌ల్యాంప్ పరికరాల ఏర్పాటు
- సిద్ధంగా ఉన్న ఐ బ్యాంకు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటై సుమారు పది సంవత్సరాలవుతోంది. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వైద్యరంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా జీజీహెచ్‌లోని ప్రతి విభాగంలో ఆధునిక సదుపాయాలు సమకూరుతున్నాయి. కంటి విభాగానికి నూతన పరికరాలు వచ్చాయి. పూర్తిస్థాయి డాక్టర్లతో నాణ్యమైన వైద్యసేవలు రోగులకు అందుతున్నాయి.

ఇప్పుడిలా..

గతంలో జీజీహెచ్‌లో కంటి వైద్యానికి సంబంధించి పరికరాలు అంతంతమాత్రంగా ఉండేవి. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేది కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. రోజూ ఓపీ సేవలతోపాటు సాధారణ కంటి జబ్బులకు వైద్యసేవలందించడమే కాకుండా సోమవారం గ్లకోమా క్లినిక్, మంగళ, గురువారాల్లో రెటీనా క్లినిక్ సేవలు, సోమ, బుధవారాల్లో కార్నియా క్లినిక్ సేవలందుతున్నాయి. పీడియాట్రిక్ అప్తాల్, స్క్విన్ట్ క్లినిక్ లాంటి ప్రత్యేక సేవలను శనివారం అందిస్తున్నారు. ఆర్బిట్ అండ్ ప్లాస్టి క్లినిక్ సేవలను, న్యూరోపతల్ క్లినిక్ సేవలను శుక్రవారం పొందవచ్చు.



కంటి వ్యాధులను పరీక్షించే ఖరీదైన లేజర్ మెషీన్, స్కిన్ట్ మెషీన్

ఖరీదైన పరికరాలు

కంటి జబ్బులను గుర్తించేందుకు రూ.25 లక్షల ఖరీదైన బీ స్కాన్ మెషీన్ ఏర్పాటు చేశారు. దీంతో కంటి వెనుక ఉండే సున్నితమైన పొర రెటీనాలో ఉండే జబ్బులు సైతం తెలుసుకోవచ్చు. అలాగే సుమారు రూ.30 లక్షల ఖరీదైన లేజర్ మెషీన్ ఏర్పాటు చేయడం జరిగింది. మరో రూ.20 లక్షలకు పైగా విలువైన స్లిట్ ల్యాంప్ కంటి ప్రెజర్‌ను తెలిపే ఆధునిక పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. పలు రకాల నూతన మైక్రోస్కోప్‌లు కూడా ఉన్నాయి. సుమారు ఇలా రూ.2 కోట్ల ఖరీదైన పరికరాలు ఏర్పాటు చేశారు.

అందుతున్న నాణ్యమైన వైద్యం

కంటి విభాగాధిపతి డాక్టర్ సంధ్యారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ సత్యనారాయణ, మరో నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, మరో ముగ్గురు పీజీ డాక్టర్లు, ఇతర టెక్నీషియన్లు, సిబ్బంది రోజూ రోగులకు వైద్యసేవలందిస్తున్నారు.



బీ స్కాన్ యంత్రం ద్వారా రోగిని పరీక్షిస్తున్న టెక్నీషియన్

పెరుగుతున్న రోగుల సంఖ్య

గతంలో రోజుకు 60 నుంచి 70 మంది రోగులు మాత్రమే పెద్దాస్పత్రి కంటి విభాగానికి వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 100 దాటి పోయింది. అలాగే ఆపరేషన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. గ్లకోమా, కాటరాక్ట్ లాంటి ఆపరేషన్లు చేస్తున్నారు. నెలకు 100 నుంచి 120 వరకు ఆపరేషన్లు జరుగుతున్నాయి.

తొలిసారిగా..

సర్వజన ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా గతంలో ఉన్న శ్రీహరి 2017లో ఐ బ్యాంక్‌ను రిజిస్టర్ చేయించారు. కంటి విభాగానికి ఒక ప్రామాణికత కల్పించారు. పెద్దాస్పత్రి ఐ టెక్నీషియన్ ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్‌తో కలిసి మృతిచెందిన వారి కంటి కార్నియాలను సేకరిస్తున్నారు. ఇదే సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రొఫెసర్ అయిన డాక్టర్ సంధ్యారాణి, కొంతమంది డాక్టర్లు బదిలీపై నెల్లూరు ఆస్పత్రికి వచ్చారు. సంధ్యారాణి ఆధ్వర్యంలో గత నెల (మార్చి)లో చూపులేని వ్యక్తికి తొలిసారిగా కార్నియల్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి చూపు వచ్చేలా చేశారు.

పూర్తిస్థాయిలో కంటి వైద్యం



పెద్దాస్పత్రి కంటి విభాగంలో రోగులకు ఉచితంగా నాణ్యమైన కంటి వైద్యం అందుబాటులో ఉంది. పూర్తి స్థాయిలో కంటి వైద్యసేవలు అందిస్తున్నాం. డాక్టర్ల బృందం అందుబాటులో ఉంది. ఇక్కడ ఎలాంటి ఖర్చు లేకుండా వైద్యసేవలు పొందవచ్చు.

– డాక్టర్ వసంత, అసోసియేట్ ప్రొఫెసర్, కంటి విభాగం

ప్రజలు వినియోగించుకోవాలి



సర్వజన ఆస్పత్రిలో కంటి వైద్య బృందం ఉంది. ప్రభుత్వం వైద్య పరికరాలు అందుబాటులోకి తెచ్చింది. అన్ని రకాల కంటి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

క్లుప్తంగా

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసైన గిరిజన మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు పట్టణంలోని జమ్మలపాళెం గిరిజనకాలనీకి చెందిన గజ్జల నారమ్మ(45) – నరసింహులు భార్యాభర్తలు. ఆమెకు నరసింహులు రెండో భర్త. పట్టణంలో చిత్తు కాగితాలు, కవర్లు సేకరించుకొని జీవనం సాగించే వీరు మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఆమె గత కొద్దికాలంగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండేది. ఓ వైపు మందులు వాడుతూ మద్యం తాగుతుండేది. ఆదివారం తెల్లవారుజామున నారమ్మ కనిపించక పోవడంతో నరసింహులు ఇంటి లోపలికి వెళ్లి చూడగా ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించాడు. పోలీసులకు విషయం తెలిపాడు. ఎస్సై శివశంకర్‌రావు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

పోలీసుల ఆర్థికసాయం


నారమ్మ – నరసింహులు వైఎస్సార్ జిల్లాకు చెందిన వారు కావడంతో వారి స్వగ్రామానికి నారమ్మ మృతదేహాన్ని తరలించేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఎస్సై శివశంకర్‌రావు రూ.4 వేల సహాయం అందించి మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో వారి గ్రామానికి పంపారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


కొండలరావు మృతదేహం

చేజర్ల: ఓ వ్యక్తి తాటి చెట్టు ఎక్కి కింద పడిపోయి మృతిచెందిన ఘటన చేజర్ల మండలంలోని మాముడూరులో ఆదివారం చోటుచేసుకొంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు మాముడూరు గ్రామానికి చెందిన ఉసురుపాటి కొండలరావు(37) ప్రతి రోజూ తాటికాయలు కొట్టి ముంజలు తీసి విక్రయించుకొని సాయంత్రానికి ఇంటికి వచ్చేవాడు. రోజులాగే ఆదివారం కూడా తాటికాయలు కొట్టుకొనేందుకు తాటిచెట్ల వద్దకు వెళ్లి సాయంత్రం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో గామస్తులు అతని కోసం వెతికారు. తాటిచెట్ల వద్ద కింద పడిపోయి మృతిచెందినట్లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న చేజర్ల ఎస్సై మరిడినాయుడు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొండలరావు మృతిచెందాడని తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


శ్రీవారి రాజగోపురానికి విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాపూరు : మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారికి మే 1వ తేదీ నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి రాజగోపురాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో, భక్తులు నడిచే మార్గలంలో చలువ పందిళ్లు వేయిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

గురుకులం విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ

కోట: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి సుయోన్‌ను ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, పీడీ శ్రీరేష్ అభినందించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన చిత్తూరులో జరిగిన అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో సుయోన్ బంగారు పతకం సాధించాడన్నారు. జాతీయ పోటీల్లో సైతం సత్తాచాటినట్లు వెల్లడించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30



వన్యప్రాణుల రక్షణపై దృష్టి

అడవులు జంతువులు, పక్షులకు నిలయాలు. వేసవిలో వన్యప్రాణులు ఆహారంతోపాటు ముఖ్యంగా నీటి కోసం నానా తంటాలు పడుతుంటాయి. అయితే అటవీ ప్రాంతాల్లో సంచరించే ఈ జంతువులు, పక్షుల సంరక్షణకు అటవీశాఖ ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు గుంతలు, నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తోంది. అంతేకాకుండా అడవులు అగ్నికి ఆహుతి కాకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

- అడవి జంతువులు, పక్షుల దాహార్తి తీర్చేలా చర్యలు
- చిన్న గుంతలు, నీటి తొట్టెల నిర్మాణం
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అటవీశాఖ అధికారులు


అడవిలో నీటి గుంతను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

నెల్లూరు(బారకాసు): వేసవిలో అటవీ ప్రాంతాల్లో గొంతెండి తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క వన్యప్రాణులు నకనకలాడుతుంటాయి. అవి దాహార్తితో ప్రాణాలు కోల్పోకుండా అటవీశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో నెల్లూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు రేంజ్ పరిధిలో 2.79 లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో అనేక రకాల పక్షులతోపాటు చిరుతపులులు, పెద్దపులులు, ఎలుగుబంట్లు, చుక్కలదుప్పిలు, అడవి పందులు, కుందేళ్లు, నక్కలు, నెమళ్లు తదితర 20 రకాల జంతువులు దాదాపు వేల సంఖ్యలో సంచరిస్తుంటాయి. వేసవిలో ఆయా జంతువులన్నీ దాహార్తిని తీర్చుకునేందుకు నీరు లభించే చోటును వెతుక్కుంటూ వెళ్తుంటాయి. ఈ క్రమంలో అడవిని దాటి రోడ్లపైకి, సమీపంలోని గ్రామాల్లోకి వెళ్తుంటాయి. ఒక్కోసారి రహదారులపై వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతుంటాయి. అంతేకాకుండా గ్రామాల్లోకి చొరబడినప్పుడు అక్కడి ప్రజలు వాటిని తరిమికొడుతుంటారు. అలా జరగకుండా ఉండాలన్న ఉద్దేశంతో వేసవిలో జంతువుల దాహార్తిని తీర్చి వాటిని సంరక్షించేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

చిన్న గుంతలు, నీటి తొట్టెల ఏర్పాటు

జిల్లాలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను గుర్తించిన అటవీశాఖ అధికారులు 180 చిన్న గుంతలను ఏర్పాటు చేశారు. ఆ గుంతల్లో నీరు నిల్వ ఉండేలా కాంక్రీట్‌తో నిర్మించారు. దీంతో వర్షపునీరు ఆ గుంతల్లో నిల్వ ఉంటుంది. అలాగే ఉదయగిరి, ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో ఏటవాలుగా ఉండే కొండలపై కూడా 25 ప్రాంతాల్లో గుంతలు తీసి వాటికి అడ్డంగా గోడలు నిర్మించి రాఫిల్ డ్యాంలు లాంటివి కూడా ఏర్పాటు చేయడం జరుగుతోంది. గుంతలు, చెక్‌డ్యాంలలో ఒక్కోసారి నీరు ఆవిరైపోతాయి. అలాంటి సమయంలో ఆ గుంతల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపేందుకు కూడా తగిన ఏర్పాట్లు చేశారు. జంతువులకు నీటి కొరత లేకుండా మరో 590 నీటితొట్టెలు ఏర్పాటు చేశారు.

అడవుల సంరక్షణకు చర్యలు

వేసవిలో అడవుల్లోని చెట్ల నుంచి రాలిన ఆకులు ఎండిపోయి అక్కడే పడిపోయి అనివార్య కారణాల వల్ల మంటలు అంటుకుంటాయి. అడవులు అగ్నికి ఆహుతి కాకుండా అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం జిల్లాలోని అటవీ ప్రాంతంలో 170 మంది సిబ్బందిని నియమించారు. వీరంతా మంటలను ఆర్ప గల సత్తా కలిగిన వారు. వీరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెలకు నిర్ణీత మొత్తాన్ని అందజేస్తారు. వీరితోపాటు 90 మంది ఆ శాఖకు సంబంధించి బేస్‌క్యాంపులో విధులు నిర్వర్తించే సిబ్బందిని కూడా నియమించారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలోనూ, సమీపంలోనూ నివసించే గిరిజనులు, స్థానికులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, వారిని చైతన్యపరిచి వారి ద్వారా కూడా అడవులను, వన్యప్రాణులను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో..

అటవీ ప్రాంతం - **2.79** లక్షల హెక్టార్లు
తవ్విన గుంతలు - **180**
నిర్మించిన నీటి తొట్టెలు - **590**

జంతు సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం



వేసవిలో జంతువుల దాహార్తిని తీర్చి వాటి సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. అటవీ ప్రాంతంలో నీరు నిల్వ ఉండేలా 180 గుంతలున్నాయి. అదనంగా 25 రాఫిల్ డ్యాంలు, మరో 590 నీటితొట్టెలు ఏర్పాటు చేశాం. అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అడవుల్లో మంటలు వ్యాపిస్తే వాటిని ఆర్పేందుకు 170 మంది సిబ్బందిని నియమించాం.

– చంద్రశేఖర్, డీఎఫ్‌ఓ (టెరిటోరియల్)


తొట్టెలో నీరు నింపుతున్న దృశ్యం(ఫైల్)

చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దాసరి రాజేష్, అశోక్‌కుమార్

నెల్లూరు(బృందావనం): స్థానిక కేవీఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న మైదానంలో చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ దాసరి రాజేష్ శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో కుటుంబంలోని పెద్దలు, పిల్లలను అలరించేలా చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఆర్గనైజర్ ఎస్కే బాబు ప్రారంభించడం హర్షణీయమన్నారు. బాబు మాట్లాడుతూ గృహోపకరణాలు, ఇమిటేషన్ జ్యువెలరీ, చిన్నపిల్లల ఆటవస్తువులు, బ్యాంగిల్స్‌తో స్టాల్స్, ఫుడ్‌స్టాల్స్‌తోపాటు జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, కొలంబస్, సోలాంబో, వాటర్ బోట్ వంటి ఎన్నో రకాల రైడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ తోటకూర అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 123
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 128



యువకుడి దారుణ హత్య

- పాతకక్షలతోనే అని తండ్రి ఫిర్యాదు
- మరో వ్యక్తిపై దాడి నేపథ్యంలోనే అంటున్న స్థానికులు


ఘర్షణ దృశ్యం


మాబుల్లా మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఓ యువకుడికి ఇద్దరు వ్యక్తులతో పాతకక్షలు ఉన్నాయి. యువకుడితో వారు సన్నిహితంగా ఉంటూ అదను కోసం వేచి చూడసాగారు. రంజాన్ రోజు రాత్రి పనిఉందని చెప్పి అతనిని ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన జనార్దనరెడ్డికాలనీ రైలువీధి దర్గా వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి తండ్రి ఫిర్యాదు ఒకలా ఉండగా.. స్థానికులు మరోలా చెబుతున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దనరెడ్డికాలనీ రైలువీధిలో షేక్ బాబు – షాబీరా దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి నలుగురు కుమార్తెలు, కుమారుడు మాబుల్లా(23) సంతానం. బాబు టీమాస్టర్‌గా పనిచేస్తూ కుమార్తెలందరికీ వివాహం చేశాడు. మాబుల్లా అవివాహితుడు. ఆయన ఓల్డ్ చెక్‌పోస్ట్ సెంటర్‌లో నివాసం ఉంటున్న బంధువు రఫి వద్ద కొయ్య పనిచేస్తున్నాడు. మాబుల్లా రెండేళ్ల క్రితం క్రికెట్ ఆడుతుండగా అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ మాజ్‌తో గొడవ జరిగి మాజ్‌పై దాడి చేశాడు. అప్పటి నుంచి మాజ్, అతని తమ్ముడు షాద్ మాబుల్లాపై కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం గమనించిన బాబు తన కుమారుడిని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఓ పథకం ప్రకారం మాజ్, షాద్ గత కొంతకాలంగా మాబుల్లాతో సన్నిహితంగా మెలగసాగారు. ఈ నెల 22వ తేదీన రంజాన్ రోజున మాబుల్లా కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లోనే ఉన్నాడు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో మాబుల్లా ఇంటికి షాద్ వచ్చాడు. పనిఉందని అతనిని బైక్‌పై ఎక్కించుకుని దర్గావీధిలోకి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మాజ్, అతని స్నేహితుడు షఫి కత్తులతో సిద్ధంగా ఉన్నారు. రాత్రి సమయంలో తన కుమారుడిని ఎక్కడికి తీసుకెళుతున్నారోనని అనుమానం వచ్చిన బాబు.. తన అల్లుడు ఖాదర్ బాషాను తీసుకుని బైక్‌పై వారిని వెంబడిస్తూ దర్గావీధిలోకి వెళ్లారు. మాబుల్లాను వారు చుట్టుముట్టి ఉండడాన్ని గమనించిన తండ్రి బాబు నా కొడుకును ఏంచేస్తున్నారంటూ పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి పరుగులు తీయసాగారు. ఈ విషయాన్ని గమనించిన మాజ్ తన తోటి వారితో మాబుల్లాను పట్టుకోమని చెప్పాడు. షాద్, షఫీ అతనిని పట్టుకోగా మాజ్ కత్తితో పొట్టలో చాతి కింది భాగంలో బలంగా పొడిచాడు. షఫి తన వద్దనున్న కత్తితో పొడిచేందుకు యత్నించగా బాబు, స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కత్తిపోట్లతో తీవ్ర రక్తస్రావంతో ఉన్న మాబుల్లాను తండ్రి, బావ బైక్‌పై ఎక్కించుకుని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ టి.వి.సుబ్బారావు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి నిందితులపై కేసు నమోదు చేశారు. హత్య జరిగిన కొద్దిసేపటికే నిందితులు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

స్థానికులు మరోలా..

మాబుల్లా మృతి ఘటనలో తండ్రి ఫిర్యాదు ఒకలా ఉండగా స్థానికులు మాత్రం మరోలా చెబుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు.. మాబుల్లా, మాజ్, షాద్, షఫి స్నేహితులు. వీరికి స్థానికంగా ఉన్న ఓ వ్యక్తితో విభేదాలు ఉన్నాయి. అతనిని ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం వీరు ఫూటుగా మద్యం తాగారు. కక్ష పెంచుకున్న వ్యక్తిని ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి గొడవకు దిగారు. ఈ క్రమంలోనే పోలీసులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. కొద్దిసేపటికి పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో సదరు వ్యక్తిని హత్య చేసేందుకు ఒడిగట్టారు. మాబుల్లా ఆ వ్యక్తిని పట్టుకోవడం, మిగిలిన వారు కత్తితో పొడిచే ప్రయత్నం చేయడం, ఇదే సమయంలో ఆ వ్యక్తి బంధువులు గట్టిగా నెట్టడంతో మాబుల్లా కత్తిపోటుకు గురయ్యాడని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే స్థానికులు ఇలా, హత్యపై బాధిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మరోలా ఉండడంతో పోలీసుల విచారణలో అసలు నిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

కల్లూరుపల్లి చెరువులో ఆక్రమణల తొలగింపు


కల్లూరుపల్లిలోని కొత్త చెరువులో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి కొత్త చెరువులో కొంతకాలంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో చేసిన ఆక్రమణలను పటిష్ట బందోబస్తు నడుమ ఆదివారం తొలగించారు. సర్వే నంబరు 8లో చెరువు పోరంబోకు భూమి 77 ఎకరాలు ఉంది. అందులో 40 ఎకరాల విస్తీర్ణం మేరకు ఇష్టారాజ్యంగా చిన్నపాటి టెంట్‌లతో ఆక్రమణలకు పాల్పడ్డారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ పలు శాఖల సమన్వయంతో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. నెల్లూరు ఆర్డీఓ మలోలా, రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బయ్య, రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి వచ్చారు. ఆక్రమణల తొలగింపున కు ముందస్తుగా పలు పార్టీలకు చెందిన నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సుమారు 700 నుంచి 800 ఆక్రమణల టెంట్‌లు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. 9 అంకణాల స్థలానికి రూ.10 వేల నుంచి రూ.25 వేలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఆక్రమణలు శాశ్వతంగా ఉంటాయని దళారులు పేద, మధ్య తరగతి వర్గాల వారిని నమ్మించి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు. నగర శివారు ప్రాంతాల్లో స్థలాల ధరలు పెరగడంతో కొందరు వ్యక్తులు సామూహికంగా ఇలాంటి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో అంబాపురంలో ఇలాంటి ఆక్రమణలకు పాల్పడగా వాటిని తొలగించాం. స్థలాలు లేని వారు ఆయా ప్రాంతాల సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వారికి స్థలాలు కేటాయిస్తాం. చెరువు పోరంబోరు స్థలంలో ప్రస్తుతం ఆక్రమణలు చేశారు. వాటిని పలు శాఖల అధికారులు సమన్వయంతో పూర్తిగా తొలగించారు.

– మలోల, నెల్లూరు ఆర్డీఓ

వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య

కావలి: మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ సీహెచ్ జనార్దన రెడ్డి కుటుంబ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులే తెలిపారని పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జనార్దనరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు ఈనాడు దినపత్రికలో ప్రచురించిన వార్త అవాస్తవమని తమ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గౌరవరం గ్రామంలో సచివాలయ భవనాన్ని నిర్మించి ఇప్పటికే రూ.27 లక్షలను ప్రభుత్వం చెల్లించిందని, ఫైనల్ బిల్లు రూ.7 లక్షలకు సంబంధించి వర్క్ ఎస్టిమేట్ కూడా తయారు చేసినట్లు తెలిపారు. కావలి మండల పరిషత్ అభివృద్ధి అధికారితో కలిసి తాను కాంట్రాక్టర్ జనార్దనరెడ్డి తండ్రి, కుటుంబ సభ్యులను విచారించగా, బిల్లుల గురించి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, నివేదికను సమర్పించినట్లు ఎస్ఈ పేర్కొన్నారు.

షార్ డైరెక్టర్‌కు విశిష్ట పురస్కారం

సూళ్లూరుపేట : శ్రీహరికోట షార్ డైరెక్టర్ గోపీకృష్ణకు విశిష్ట పురస్కారం లభించింది. గుంటూరుకు చెందిన తెలుగు సంస్కృతి అకాడమీ వారు ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులను పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈ క్రమంలో విద్య, శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించి గోపీకృష్ణ ఎంపికయ్యారు. ఆయనకు ఈ నెల 25వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్సిటీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేయనున్నారు.